

భగ్గుమంటున్న భానుడు

- పెరుగుతోన్న ఎండ తీవ్రత
- బయటకు రావాలంటే జంకుతున్న జనం
- ఎండలతో వడదెబ్బకు గురైతే ప్రాణాపాయం
- జాగ్రత్తలు తీసుకుంటేనే ఆరోగ్యం పదిలం

ధర్మవరం అర్బన్: భానుడు భగ్గుమంటున్నాడు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్క్ దాటుతున్నాయి. ఉదయం 11 గంటలు అయ్యేసరికి ఇంటి నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సాయంత్రం 4 గంటలు దాటేవరకు బయట తిరగడంలేదు. ధర్మవరం పట్టణంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వేసవిలో సాధారణంగా అపాయానికి గురిచేసేది వడదెబ్బ. దీనినే హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ అంటారు. తీవ్రస్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. శరీర ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల వడదెబ్బకు గురవుతారు. జాగ్రత్తలు తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బకు కారణాలు...

వేడిమి ఎక్కువగా ఉన్నచోట్ల ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది. శరీరం ఉప్పుకన్నా ఎక్కువ నీటిని కోల్పోతే వడదెబ్బ తగులుతుంది. నీటి కంటే ఉప్పు శాతం చెమట ద్వారా పోతుంటే దాహం అంతగా ఉండదు. నీరు బాగా తాగి ఉప్పు మాత్రం సరిపడునంత తీసుకోకపోతే వడదెబ్బ ఎక్కువగా తగిలే అవకాశముంది.



ధర్మవరంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

బాధితులు ఎవరంటే..

65 ఏళ్ల వయస్సు పైబడిన వారు, పసిపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గుండెజబ్బులు, అధిక రక్తపోటు ఉన్న వారు వడదెబ్బకు గురవుతున్నారు.

లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల సెల్సియస్ ఉన్నపుడు నాడి వేగంగా కొట్టుకోవడం, తలనొప్పి, తల తిరగడం, పాడిబారిన చర్మం, తడి ఆరిన నాలుక, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళతారు.

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. శరీరంపై దుస్తులు తొలగించి చల్లని నీటితో కడగటం కానీ, చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవటం కానీ చేయాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరం అంతా అద్దితే చాలా మంచిది. శరీరం అంతా చల్లని గాలి తగిలేలా చూడాలి. బాధితులకు చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలను కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. ప్రథమ చికిత్స చేసి వెంటనే ఆస్పత్రికి తరలించాలి. స్పృహ కోల్పోతే మాత్రం సమయం వృథా చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం మరీ మంచిది.

ముందు జాగ్రత్తలు..

- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను సేవించడం (అతి శీతల పానీయాలు సేవించరాదు)
- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్త వహించాలి.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పండ్ల రసాలు తాగాలి. గొడుగు ఉపయోగించాలి.
- వేసవిలో తెల్లని దుస్తులు, తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఆల్కహాలు సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. ఇది విషమ పరిస్థితికి దారితీస్తుంది. ఆల్కహాల్ సేవించకుంటే చాలా మంచిది.
- ఇంటి గదుల ఉష్ణోగ్రతను తగ్గించటానికి కిటికీలు, తలుపులకు తెరలను వాడాలి. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషనర్లు ఉపయోగించవచ్చు.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలను తీసుకోవాలి.

జాగ్రత్తలు పాటించండి



వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఉప్పు కలిపిన నీరు తాగాలి. సాధ్యమైనంత వరకు ఎండలో పనిచేయకుండా చూసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి శరీరంపైనున్న దుస్తులను తొలగించి చల్లని నీటిలో కడగడం లేదా గుడ్డతో తుడవడం చేయాలి. అనంతరం వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ మాధవి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

పంటనష్టంపై పక్కా నివేదికలు

తాడిమర్రి: మండలంలోని దాడితోట, నాయనపల్లి, తురకవారిపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో నేలకొరిగిన అరటి తోటల వివరాలను పక్కాగా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఉద్యాన శాఖ అధికారి అమరేశ్వరి పేర్కొన్నారు. సోమవారం ఆమె వివిధ శాఖల సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొరిగిన అరటి తోటలను పరిశీలించి, బాధిత రైతులతో పెట్టుబడి, జరిగిన నష్టం తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. దాడితోట, తురకవారిపల్లి గ్రామాల్లో సుమారు 80 హెక్టార్లలో పంట నష్టం జరిగి ఉండవచ్చని ఉద్యానశాఖ అధికారి తెలిపారు. పూర్తి నివేదికను తయారు చేయడానికి మూడు రోజుల సమయం పడుతుందన్నారు. పంటనష్టపోయిన ప్రతి రైతు తోట వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు చరణ్, కన్నప్ప, రాజు, ఉద్యానశాఖ సిబ్బంది రామాంజి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



దాడితోటలో అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

ఆక్రమిత భూములు గిరిజనులకు అప్పగించాలి

ప్రశాంతి నిలయం: ముదిగుబ్బ మండలంలో నాలుగు దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆక్రమించారని, వాటిని విడిపించి వెంటనే బాధితులకు అప్పగించాలని సీపీఐ, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్ ఎదుట బాధిత గిరిజనులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూముల ఆక్రమణపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ చేపట్టి తప్పుడు నివేదికలు సమర్పించారని ఆరోపించారు. ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులు న్యాయం కోసం ఆందోళనలు చేస్తుంటే అధికారులు తగిన విధంగా స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కృష్ణానాయక్, రవీంద్రనాయక్, సేవేనాయక్, రమణానాయక్, రవిబాబు, వెంకటేష్, శీనా, సీపీఐ నాయకులు కదిరప్ప, మధునాయక్, బాధిత రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు, సీపీఐ నాయకులు

కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

- చికెన్ కబాబ్ సీజ్

తనకల్లు: హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య హెచ్చరించారు. మండలంలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న పలు హోటళ్లలోని ఆహార పదార్థాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఆహార పదార్థాలను కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఫైవ్ స్టార్ కబాబ్ సెంటర్‌లో కుళ్లిన మాంసంతో చికెన్ కబాబ్ అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం కబాబ్ సెంటర్‌లో చేసిన చికెన్ కబాబ్‌ను సీజ్ చేశారు. దీన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

క్షయ నిర్మూలనకు సహకరించాలి



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాలోమన్, వైద్య సిబ్బంది



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌లో మానవహారం

ధర్మవరం అర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాలోమన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ క్షయ ఒక అంటు వ్యాధి అని, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్ల పడటం, బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం, ఉమ్మిలో రక్తం పడటం ఇలాంటి లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు. క్షయ రోగికి చికిత్స కాలంలో ప్రతినెలా రూ.1000 బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పుష్పలత, శ్వేత, టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు క్రిష్టప్ప, రహమత్‌బాషా, ఎరుకలప్ప, బాలాజీ నాయక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్షయరహిత సమాజమే లక్ష్యం

క్షయ రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ శ్వేత పేర్కొన్నారు. సోమవారం ముదిగుబ్బ పీహెచ్‌సీలో అంతర్జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ క్షయ వ్యాధి ఎలా వస్తుంది.. లక్షణాలు ఉంటాయి.. నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరస్వతమ్మ, ఎంపీహెచ్ఎస్ భాస్కర్‌రెడ్డి, విజయకుమారి, సబ్‌యూనిట్ అధికారి దేవ్లానాయక్, ఎల్‌టీ ఉషా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో ర్యాలీ

కదిరి టౌన్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో కదిరి ఏరియా ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ క్షయ వ్యాధి గురించి వివరించారు. అనంతరం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సదర్భంగా వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రంతో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్యులు, ఆశా కార్యకర్తలు, జనజాగృతి సంస్థ సిబ్బంది, ఆర్‌టీబీసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ పట్ల నిర్లక్ష్యం వద్దు

తనకల్లు: క్షయ పట్ల నిర్లక్ష్యం వద్దు అని కొక్కంటి ప్రాథమికారోగ్య కేంద్రం వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. కొక్కంటిక్రాస్‌లో జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి–42పై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

నల్లమాడ: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం రెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో క్షయ వ్యాధి లక్షణాలు, క్షయ వ్యాధి ఇతరులకు సోకే విధానం, నివారణ, చికిత్స విధానం గురించి తెలియజేశారు. సీహెచ్ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్లు ఎస్ఎం బాషా, మంజుల, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొరియర్ వ్యాన్ బోల్తా



బత్తలపల్లి: అనంతపురం – కదిరి రహదారిపై బత్తలపల్లి బైపాస్ రోడ్డులో వేల్పుమడుగు క్రాస్ వద్ద సోమవారం అదుపుతప్పి కొరియర్ వ్యాను బోల్తా పడింది. వ్యాను కొద్దిదూరం వెళ్లి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. వ్యానులో డ్రైవర్ ఒక్కడే ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం పది గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, ప్రజాప్రతినిధులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలోని అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ఓడీచెరువు : పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎంఈఓ సురేష్‌బాబు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 702 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ కిష్టప్ప తనిఖీ చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఓడీచెరువు : స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయిపడిన ఎనిమిది నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెండింగ్ జీతాలు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, శానిటరీ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమ తొలగింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెకు సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కుళ్లాయప్ప, కార్మికులు అంజనప్ప, గంగులప్ప, లక్ష్మీదేవి, నిర్మల, శ్రావణి తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ గోపీ

తనకల్లు: వేసవిలో ప్రజలకు దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమని ఎస్ఐ గోపీ తెలిపారు. కొక్కంటిక్రాస్‌లో వందేమాతరం టీం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వందేమాతరం టీం సభ్యులు సుంకు వెంకటరమణ, అశోక్, గోవిందు బాలకృష్ణ, బక్కసం నవీన్, శ్రీనాథ్, రవీంద్ర, రమేష్, భాస్కర్, సత్య, శీనా, శివ, షాకీర్, కార్తిక్, హరీష్, సుబ్బయ్య, సుధాకర్, శీనప్ప, సందీప్, రాజశేఖర్‌నాయక్, నవీన్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



రూపా (ఫైల్)

ధర్మవరం అర్బన్: భర్తతో గొడవపడి మనస్తాపం చెందిన మహిళ ఇంటి నుంచి బయటకెళ్లి అదృశ్యమైంది. సోమందేపల్లికి చెందిన రూపా, గురురాజ్ దంపతులు. వీరు మూడు వారాల కిందట ధర్మవరం పట్టణానికి బతుకుదెరువు కోసం వలస వచ్చారు. రామ్‌నగర్‌లో కూలి మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపం చెందిన రూపా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో రూపా అత్త రమణమ్మ సోమవారం ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మూడు బృందాలుగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలోని మౌలిక వసతులు, బస్సు సౌకర్యం, ఇంగ్లిష్ విద్యపై అవగాహన పెంపొందిస్తున్నారు. ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డుతో పాఠశాల వద్దకు వస్తే దరఖాస్తు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ బాబు పేర్కొన్నారు.

28న వారపుసంత, షాపింగ్ రూములకు వేలం

తనకల్లు: మండల కేంద్రంలోని వారపు సంతతో పాటు పంచాయతీ కార్యాలయంలో ఉన్న రెండు షాపింగ్ రూములకు ఈ నెల 28న వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలో రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. సుందరయ్యనగర్‌కు చెందిన సునీత, రామ్‌నగర్‌కు చెందిన వేణుగోపాల్ తమ స్కూటీలను ఆదివారం రాత్రి ఇళ్లముందు పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయానికల్లా స్కూటీలు కనిపించలేదు. బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

కేసులకు అదరం..బెదరం

కదిరి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని, ఇలాంటి వాటికి తాము అదరం.. బెదరం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కదిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గాండ్లపెంట మండలం సోమాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవితో పాటు ఆమె భర్త గోపాల్‌నాయక్‌ను కిడ్నాప్ చేశారని తమ పార్టీ సమన్వయకర్త మక్బూల్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పరికి షామీర్, పరికి సాదిక్‌లపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. తమనెవరూ కిడ్నాప్ చేయలేదని, తమ బిడ్డ అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వచ్చామని స్వయంగా లక్ష్మీదేవమ్మ, గోపాల్‌నాయక్ దంపతులు ఒక వీడియో విడుదల చేశారని, ఈ విషయం పత్రికల్లో కూడా వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ పార్టీ శ్రేణులపై ఇప్పటికే ఎన్నో తప్పుడు కేసులు పెట్టారని, అయినా సరే ఇన్నాళ్లూ ఓపికతో భరించామని, ఇక మీదట అలా ఉండదని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కక్ష సాధింపులకు దిగితూ టీడీపీ నేతల ద్వారా తప్పుడు కేసులు బనాయిస్తూ వస్తే ప్రజలు సరైన సమయంలో తగిన బుద్ధి చెప్తారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని, ఆర్థికంగా కూడా తగిన సహకారం అందిస్తామని వజ్ర భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సొంత పార్టీ ఎంపీటీసీని తామెందుకు కిడ్నాప్ చేస్తామని మైనార్టీ నాయకులు సాదిక్ ప్రశ్నించారు. రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలపై ఎమ్మెల్యే కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మాజీ కౌన్సిలర్ పరికి షామీర్ ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు లోకేశ్వరరెడ్డి, మండల కన్వీనర్‌లు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి

కార్యకర్తలకు పరామర్శ

ఎన్పీకుంట: మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మరికొమ్మదిన్నెకి చెందిన ఎస్.మహబూబ్‌బాషా (36) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. జౌకలకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్ బుల్లెట్ బాబా కుమార్తె తహరీమ్ (8) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ రెండు కుటుంబాల సభ్యులను పూల శ్రీనివాసరెడ్డి పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. చయ్యప్పగారిపల్లికి చెందిన దుద్దుకుంట వెంకటరెడ్డి తల్లి సత్యమ్మ వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన గౌకనపేటకు చెందిన మొగల్ మునీర్‌బాషాను పరామర్శించారు.



గాజులవారిపల్లితండాలో కార్యకర్తను పరామర్శిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

గాండ్లపెంట: గాజులవారిపల్లితండాలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరమణను రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి పరామర్శించారు.



అక్కదేవతల విగ్రహాలను, గొడుగులను భక్తి శ్రద్ధలతో తీసుకెళుతున్న మహిళలు

వైభవంగా అక్కదేవతల జాతర

ఎన్పీకుంట: వడ్డిపల్లిలో సోమవారం అక్కదేవతల జాతర వైభవంగా నిర్వహించారు. అక్కదేవతల విగ్రహాలతో పాటు గొడుగులను మహిళలు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి కోలాటాలు, చెక్కభజనలతో ఊరేగింపు సాగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూలశ్రీనివాసులురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, సర్పంచ్ వల్లెపు వెంకటేష్, ఉపసర్పంచ్ వెంకటయ్య, బోరెడ్డి నీలకంఠరెడ్డి, ఆంజి, ప్రశాంత్, ఆంజనీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.